www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 17 డిసెంబర్ 2022
7
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ చక్రధర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని వరకవిపూడి, మండపం పంచాయతీల్లోని జగనన్న లే అవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లు నిర్మించని వారు వెంటనే నిర్మించుకోవాలన్నారు. లేదంటే పట్టాలు రద్దు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. అంతేకాకుండా కట్టిన ఇళ్లకు వెంటనే బిల్లులు చెల్లిస్తామని చక్రధర్‌బాబు లబ్ధిదారులకు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సిమెంట్, ఇసుక, ఐరన్, అదేవిధంగా డోర్లు, కిటికీలు అందిస్తున్న విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచులు ఇసనాక రమేష్ రెడ్డి, కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం, ప్రత్యేక అధికారి చేజర్ల శ్రీనివాసులు, తహశీల్దార్ హమీద్, ఎంపిడిఒ కన్నం హేమలత, హౌసింగ్ ఏడి, ఎఇ ముక్తార్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

ఆర్‌టిసిలో బలమైన ఉద్యమం నిర్మించాలి

ఎస్‌డబ్ల్యుఎఫ్ మహాసభలో ఎంఎ గపూర్
ఘనంగా ముగిసిన రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి-నెల్లూరు

ఆర్‌టిసిలో బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ గపూర్ పిలుపు నిచ్చారు. నెల్లూరు నగరంలో జెట్టిశేషారెడ్డి భవన్ (జక్కావెంకయ్యనగర్) రెండు రోజుల పాటు జరిగిన ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర 12 మహాసభలు ఘనంగా ముగిశాయి. ఈ మహాసభల్లో పాల్గొన్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గపూర్ మాట్లాడుతూ ఆర్‌టిసిని ప్రయివేటీకరణ చేసే కుట్ర జరుగుతుందని, దీన్ని తిప్పి కొట్టాలంటే ఎస్‌డబ్ల్యుఎఫ్ ఉద్యమం బలంగా ఉండాలన్నారు. అందరి కార్మికులను కలుపుకొని సంఘటిత పోరాటం నిర్మించాలని తెలిపారు. కార్మికులు ఏ సంఘానికి చెందిన వారైనప్పటికీ న్యాయం కోసం ప్రభుత్వంతో పోరాటం చేయాలని, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, యాజమాన్యాలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఐక్య పోరాటాలతోనే కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం అవుతాయని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలను చింతపిప్పగా చెక్కిన అమ్మేస్తున్నారన్నారు. 12వ రాష్ట్ర కమిటీకి ఎన్నికైన సభ్యులు కార్మికుల బలపరిచే విధంగా, ఆర్‌టిసి సంస్థ పరిరక్షణ కోసం పనిచేయాలని సూచించారు. ఆర్‌టిసి గ్యారేజీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి సైతం పోరాటాలు చేయాలని, ఈ మహాసభలు అందుకు అనుగుణంగా తీర్మానాలు చేసుకుందన్నారు. ఆర్‌టిసి డిపోలలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులతో కలిసి వారి సమస్యల పరిష్కారానికి పనిచేయాలన్నారు. ఆర్‌టిసిలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు దారుణంగా ఉన్నాయని, వారికి వేతనం రూ.6 వేలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు.కార్మిక ప్రయోజనాలకు, సంస్థ పరిరక్షణే ధ్యేయంగా అనేక ఐక్యఉద్యమాలకు శ్రీకారం చుట్టాలన్నారు. ఈ మహాసభలకు హాజరైన మరో ముఖ్యఅతిథి ఎంఎల్‌సి షేక్ సాబ్జీన్ మాట్లాడుతూ పోరాడితే పోయేదేమీ లేదు ఆర్‌టిసి కార్మికుల కష్టాలు తప్ప అని అన్నారు. ఆర్‌టిసి ఉద్యమాలకు నెలఫ్గా ఉండేది అభి ప్రాయం వ్యక్తం చేశారు. ఆర్‌టిసి కార్మికులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరూ కలిసికట్టుగా ఐక్య పోరాటాలు చేయడం వలనే ఎంతటి సమస్యనైనా సులువుగా సాధించుకోగలమన్నారు. అటువంటి నిర్ణయాలు తీసుకునేందుకు ఈ మహాసభ మార్గదర్శకంగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ 12వ మహాసభలు అనంతరం అందరి ఏకాభిప్రాయంతో ఏర్పడిన నూతన కమిటీ పిలుపు మేరకు ఈ నెల 23వ తేదిన ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంస్థ పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించామన్నారు. ఈ మహాసభలకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య, ఆహ్వాన సంఘం కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సీతాలక్ష్మి, డివి.కుమారి, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.పరుశురాం, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.వి.జి రవిశంకర్, ఎం.అరుణకుమారి, బిడిఆర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వి.కృష్ణారావు, ఎన్.రాజశేఖర్, ఎం.హరిప్రసాద్, టిపిఆర్ దోర, ఎంసిహెచ్ అరుణ, ఎం.హరిప్రసాద్, పోరాఠాకాలు, టిడి సిప్రస్ బలరాలు వి.రాములు, జివి సుజాత పలు జిల్లాలకు చెందిన ఎస్‌డబ్ల్యుఎఫ్ ప్రతినిధులు, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.సూరిబాబు ఈ మహాసభలకు హాజరయ్యారు.

మాట్లాడుతున్న ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య

సభకు హాజరైన ప్రతినిధులు

పారిశుధ్యంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజలందరికీ పారిశుధ్యంతో పాటు మంచినీటి పరిశుభ్రతపై అవగాహన పెంచాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత పిలుపు నిచ్చారు. "యూ నిసెఫ్ - సర్డ్ - నవజీవన్" సంస్థల సంయుక్త ధ్వర్యంలో "పట్టణ నీరు, పారిశుధ్యం, పరి శుభ్రత" అనే అంశాలపై కార్పొరేషన్ కార్యా లయంలోని పురసేవ సమావేశ మందిరంలో శుక్రవారం కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమిష నర్ హాజరై మాట్లాడారు. నగర వ్యాప్తంగా మంచినీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఉత్తమ ప్రణాళికలను సిద్ధం చేశామని తెలిపారు. ప్రతీ ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, తాగునీటి స్వచ్ఛతకు ప్రాధా న్యత కల్పిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో స్పెషల్ డ్రైవ్ ద్వారా విస్తృత స్థాయిలో పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపట్టి నగరాన్ని సుందరంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. సమావేశంలో డాక్టర్ వెంకట రమణ, ఇఇ సంపత్, డి.ఎం .హెచ్.ఒ డెవెూ అధికారి శ్రీనివాసరావు, సహదేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-నెల్లూరు

అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న అని రూడ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్ అన్నారు. శుక్రవారం బుజబుజ నెల్లూరు శివార్ల ప్రాంతంలో ఆస్తాన ఆర్యయా మహిళా మండలి వద్దుల ఆశ్రమంలో వీఎంఎ్ అసోసియేషన్, రూడ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో విశ్వనాథం చెంగమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కుమార్తె బాలమ్మ, మనుమళ్లు రాకేష్, నాగార్జున, మనవరాలు సన ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మంలో వీఎంపీ నాయకులు గోరంట్ల శేషయ్య, శ్రీనివాసులు, జే.పార్థసారథి, బాలమ్మ, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

క్రీడలవైపు యువత మక్కువ చూపాలి

ప్రజాశక్తి-నెల్లూరు

సెల్ ఫోన్లు, లాప్టాప్ లు, టీవీల వ్యామోహం నుంచి యువత బయటపడి క్రీడల వైపు మక్కువ చూపాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పిలుపు నిచ్చారు. శుక్రవారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో రెండు రోజులపాటు జరిగే మాస్టర్స్ అథ్లెటిక్ (30 సంవత్సరాలు పైబడిన వారికి పరుగు పందెం) రాష్ట్ర స్థాయి ఛాంపియన్షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ముందుగా ఈ క్రీడా పోటీలల్లో పాల్గొనేందుకు క్రీడామైదానికి విచ్చేసిన క్రీడాకారులను కలెక్టర్ కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్క రించిన కలెక్టరుకు క్రీడాకారులు క్రీడాభివందనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లి ఒడి నుంచే ప్రతిఒక్కరూ క్రీడలను నేర్చుకుంటారని, క్రీడలకు వయసుతో సంబంధం లేదన్నారు. అన్ని వయసుల వారు క్రీడలను తమ జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 90 ఏళ్లకు పైబడిన వద్దులు కూడా వయసుతో సంబంధం లేకుండా ఈ పోటీల్లో పాల్గొనడం క్రీడల ఔన్నత్యానికి నిదర్శనం అన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనే వారందరూ తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటూ క్షేమంగా తిరిగి వెళ్లాలన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ క్రీడల వైపు ఆసక్తి చూపాలన్నారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి పరుగు పందెం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన సీనియర్ క్రీడాకారులను కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ సి సి 24వ ఆంధ్ర బెటాలియన్ సీఈవో పీకే పాండే, మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ రాజశిఖామని, ప్రెసిడెంట్ లక్ష్మీపతి రాజు, స్టేట్ సెక్రటరీ రాంప్రసాద్, జిల్లా సెక్రెటరీ ఎం విజయలక్ష్మి రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వినయ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

పట్టాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక 30 వ డివిజన్ మల్లయ్యగుంట గిరిజన కాలనీ లో నిరుపేదల నివాసాలకు కరెంటు మీటర్లు, ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని స్థానిక సిపిఎం శాఖ సభ్యులు కలిసి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఈ ప్రాంతంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక సిపిఎం శాఖ సభ్యులు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల నుంచి ఈ ప్రాంతంలో నిరుపేదలు నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారని, ప్రభుత్వం ఈ నివాసాలకు విద్యుత్తు మీటర్లు ఏర్పాటు చేయాలని, ఈ స్థలంలో నివాసం ఉన్న వారికి పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. స్థానిక సమస్యపై ఎంఎల్ఎ సానుకూలంగా స్పందించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 30 డివిజన్ సిపిఎం బాధ్యుడు కండె కోటేశ్వరరావు, స్థానిక గిరిజన కాలనీవాసులు ఆవుల చెంచయ్య దయాకర్ రమేషు కత్తి అంకమ్మ జయమ్మ తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు

ఎంఎల్ఎ శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

దేవకి వెంకటేశ్వర్లకు సన్మానం

ప్రజాశక్తి-కందుకూరు: మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పబ్బిశెట్టి శివ ఇంటిలో వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లను శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మద్రాస్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనం నుంచి అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు జన్మించిన గ్రామమైన ప్రకాశం జిల్లా పీసీ పల్లె మండలం, పడమటి పల్లె గ్రామానికి పొట్టి శ్రీరాములకు ఘనంగా నివాళులర్పిస్తూ సినీ నటుడు త్రిపురనేని రామస్వామి మనవడు త్రిపురనేని గోపీచంద్ తలపెట్టిన పాదయాత్ర పొట్టి శ్రీరాములు వర్ధంతి రోజైనా గురువారం నుండి మొదలు పెట్టారన్నారు. ఆయన పాదయాత్రకు ఆర్యవైశ్యులు సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు. సుమారు పాదయాత్ర 15 రోజులు పాటు కొనసాగుతుందని పడమటిపల్లిలో ఆర్యవైశ్య ప్రముఖుల చేత భారీ సభను ఏర్పాటు చేస్తామని తెలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ లాంటి దేశ నాయకులు ఒక ప్రాంతానికి ఒక కులానికి చెందిన వారు కాదని అలాంటివారు అందరికీ చెందిన వ్యక్తులని అన్నారు. అస్పృశ్యత నివారణకు గాంధీ మహాత్ముడు ఉద్యమిస్తే, హరిజనవుతోరణం కోసం ఉద్యమిచ్చారన్నారు. ఈ సందర్భంగా తనకు సన్మానం చేసిన కందుకూరు ఆర్యవైశ్య సంఘం నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పబ్లిశెట్టి శివ, ఆర్యవైశ్య నాయకులు మురారి శెట్టి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కోట నరసింహం, వాసవి సేవాదళ్ అధ్యక్షులు చీదెళ్ల వేణుగోపాల్, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం మీడియా చైర్మెన్ చక్కా వెంకట కేశవరావు, తాతా లక్ష్మీనారాయణ, మోదడుగు నరసింహం, తుమ్మపూడి సుబ్బయ్య, కందగడ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

టిడిపితోనే అభివృద్ధి

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం పట్టణంలోని 3వ వార్డు ఉప్పు చెరువు పాలిటెక్నిక్ కాలేజీ ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నేతలు ఇంటింటికి తిరుగుతూ సమస్యలు తెలుసుకు న్నారు. మల్లేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి హయాంలోనే రాష్ట్రం అన్ని రంగాలుగా అభివద్ధి చెందిందన్న విషయాన్ని ఎవరు మర్చిపోలేరన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సంక్షేమం, అభివద్ధి తమ పార్టీ హయాంలోనే జరిగిం దన్నారు. వారందరి అభ్యున్నతికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి లక్షల మందికి రుణాలు ఇవ్వడం ద్వారా పేదల స్థితిగతులు మార్చామన్నారు. తామేదో ఉద్ధరిస్తామంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక్క మంచి పని కూడా చేయలేదన్నారు. కేవలం సంక్షేమ పథకాలను పదే పదే చెప్పుకుంటూ ప్రజలను మోసం చేసే పనిలో ఉన్నారని మల్లేశ్వరరావు విమర్శించారు. ఒకసారి మోసపోయిన ఆంధ్ర రాష్ట్ర ప్రజలు మరోసారి మోసపోరన్న విషయాన్ని వైసీపీ నేతలు తెలుసుకోవాలన్నారు. వైసీపీ నేతలు చెప్పగలరా అని మల్లేశ్వరరావు ప్రశ్నించారు. అనంతరం వార్డు ప్రజలతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పువ్వాడి కోటయ్య, ఇత్తడి పేతురు, భవనాసి వెంకటేశ్వర్లు, కందల వెంకట్రావు, ఇత్తడి సురేష్, కంసాని మయూరి, మధు మధు, పూజల వెంకటరావు, చుండూరి శ్రీను, నాయకులు పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య, రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు సవిడి బోయిన వెంకటకష్ణ, తదితర నాయకులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

17నుంచి ఇదేమి ఖర్మ మనరాష్ట్రానికి

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు సూచన మేరకు, కందుకూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య ఆధ్వర్యంలో జరిగే "ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా 17,పలుకూరు, 18,అనంతసాగరం, 19బలిజ పాలెం, 20 మోపాడు, 21కొండి కందుకూరు గ్రామాలలో సాయంత్రం 4గంటలకు గ్రామ పార్టీ అధ్యక్షులు అధ్యక్షతన కార్యక్రమం జరుగుతుందని నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ఒక ప్రకటనలో తెలిపారు.

పొగాకు పంట పరిశీలన

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: మాండూస్ తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న పొగాకు పంటలను పొగాకుబోర్డు ఆధ్వర్యంలో బృందం శుక్రవారం పరిశీలించింది. 27వ వేలంకేంద్రం పరిధిలోని నలదలపూరు, పోలినేనిపాలెం గ్రామాల్లో మేనేజర్లు, సిటిఆర్ఐ శాస్త్రవేత్తలు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు అదనపు నీటి ఒత్తిడికి సున్నితంగా ఉంటుందని, ఇది నేలకణాలు, వాతావరణ మధ్య గాలి మార్పిడి నిలిపివేస్తుందన్నారు. చురుకైన వేరు ఉపరితలం, నేలలోని సూక్ష్మజీవులకు ఆక్సిజన్ ప్రవాహాన్ని తీవ్రంగా అడ్డుకుంటుంది. అత్యవసరంగా వేరుకు గాలి అందించాలి. మొక్క మొదలు దగ్గర కాండానికి ఇరువైపులా నాలుగు అంగుళాల దూరంలో ఒకలోతు కర్రతో గుచ్చి వేరుకు గాలి ఆడేలా చూడాలి. అనుకూలమైన తేమస్థాయిలో వీలైనంత త్వరగా అంతర సేద్యం చేపట్టాలి. పంటకు అదనంగా ఒక హెక్టారుకు పది కేజీలు నత్రజని లేదా పొటాషియం నైట్రేట్ ఒక పర్సంట్ పోలీయర్స్ స్ప్రే చేయాలి. శాస్త్రవేత్తలు ఎం అనూరాధ, పూర్ణబిందు, కె ప్రభాకరరావు, బోర్డు విస్తరణ మేనేజరు దామోదర్, వేలం నిర్వహణాధికారి శంకరరావు, అధికారి రాజగోపాల్, క్షేత్రాధికారి హర్ష, రైతులు పాల్గొన్నారు. అదేవిధంగా నలదలపూరు గ్రామంలో దెబ్బతిన్న పొగాకు పంట త్వరగా కోలుకునేందుకు ప్రయోగాత్మకంగా డ్రోన్ స్ప్రేయర్‌తో పొటాషియం సల్ఫేట్ స్ప్రే చేయించారు. కార్యక్రమంలో వ్యవసాయ సబ్‌డివిజన్ సంచాలకులు ఎం శేషగిరి, బోర్డు అధికారి రాజగోపాల్, వ్యవసాయాధికారి ఎం హేమంత్ భరత్‌కుమార్ పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న అధికారులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి -కందుకూరు: స్థానిక టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం నూతనంగా చేరిన మొదటి సంవత్సరం విద్యార్థిని, విద్యార్థులకు రెండవ, మూడవ సంవత్సర విద్యార్థులు స్వాగత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రిన్సిపల్ ఎం.రవికుమార్ కళాశాల అందిస్తున్న సదుపాయాల గురించి వివరించారు. విద్యార్థుల సర్వతోముఖాభివద్ధికి కళాశాల అన్ని విధాలా సహకరిస్తుందని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించే విధంగా బోధన ఉంటుందని అధ్యాపకులందరూ తెలియజేశారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థిని విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఎం. రవికుమార్

జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్‌కు విద్యార్థినులు ఎంపిక

ప్రజాశక్తి-పొదలకూరు: నెల్లూరు లోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14,17 బ్యాడ్మింటన్ (షటిల్) ఎంపికలలో అమ్మవారి పాలెం విద్యార్థినులు అంతటి తేజ 10వక్లాస్, నాగినేని పల్లవి 9వ క్లాస్ ఉత్తమ ప్రతిభ కనపరచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సురేంద్ర కుమార్ తెలిపారు. అండర్ 14 కు ఎంపికైన పల్లవి మదనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో, అండర్ 17 కు ఎంపికైన అంతటి తేజ వైఎస్ఆర్ కడప సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయకుమార్, ఉపాధ్యాయులు శ్రీహరి రెడ్డి, వెంకటరెడ్డి, సుభాషిణి, గౌస్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఎంపికైన విద్యార్థినులు

ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-కందుకూరు: ఉలవపాడు మండలం వరిగసంఘంకు చెందిన టిడిపి కార్యకర్త రాపూరి మస్తాన్‌కు పేదకుటుంబం కావడం, వారి కుమార్తె నాగమ్మ వివాహం సందర్భంగా పెళ్లికానుక పథకం అమలులో లేకపోవడంతో పెళ్లి ఖర్చులకోసం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఆ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ తక్షణమే స్పందించి వారి అనుచరుల ద్వారా కందుకూరు పామూరు రోడ్‌లోని తన కార్యాలయంలో. మస్తాన్ కుటుంబ సభ్యులకు పెళ్లి ఖర్చుల నిమిత్తం, 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో చౌటూరి బ్రహ్మయ్య, మల్లవరపు రమణయ్య, రాపూరి వెంకయ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు సూచనలు

ప్రజాశక్తి -కందుకూరు: తుపాన్ వల్ల దెబ్బతిన్న పొగాకు పంటలను పరిశీలించుటకు పొగాకు బోర్డు ఆధ్వర్యంలోని మేనేజర్లు, సిటిఆర్ఐ శాస్త్రవేత్తల బందం కందుకూరు 27 వేలంకేంద్రం పరిధిలోని మోపాడు, నలుదలపూరు, పోలినేని పాలెం గ్రామాల్లో పర్యటించారు. పొగాకు అదనపు నీటి ఒత్తిడికి చాలా సున్నితంగా ఉంటుందని ఇది నేల కణాలు, వాతావరణ మధ్య గాలి మార్పిడి నిలిపిస్తుందని, చురుకైన వేరు ఉపరితలం, నేలలోని సూక్ష్మజీవులకు ఆక్సిజన్ ప్రవాహాన్ని తీవ్రంగా అడ్డుకుంటుంది కనుక అత్యవసరంగా వేరుకు గాలి అందించడం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిటిఆర్ఎస్ శాస్త్రవేత్తలు ఎం అనూరాధ, పూర్ణ బిందు, కె.ప్రభాకర్ రావు, పొగాకు బోర్డు నుంచి విస్తరణ మేనేజర్ దామోదర్, వేలం నిర్వహణ అధికారి శంకర్రావు, వేల నిర్వహణ అధికారి రాజగోపాల్, క్షేత్రాధికారి శ్రీహర్ష, రైతులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిస్సహాయలులైన వద్ధులను, వికలాంగులను గుర్తించి వారికి భోజనాల ప్యాకెట్లు శుక్రవారం అందించారు. ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా పేదవారికి సహాయం అందిస్తే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని ఫౌండేషన్ సెక్రటరీ షంషేర్ అన్నారు. చేయి చేయి కలుపుదాం. పేదవారిని ఆదుకుందామనే నినాదంతో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ సాజిద్, ట్రెజరర్ హఫీజ్, ఇన్‌ఛార్జ్ అయూబ్ ఖాన్ పఠాన్, షంషుద్దీన్ పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి -కందుకూరు: పొన్నలూరు మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో దుంప వెంకటరామిరెడ్డి కుమార్తె వివాహ కార్యక్రమానికి ఎంఎల్ఎ తూమాటి హాజరయ్యారు. వధూవరులను ఆయన ఆశీర్వదించారు.

ఈ దుర్మార్గపు పాలన మాకొద్దు..

ప్రజాశక్తి-లింగసముద్రం: కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు మండలంలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.పార్టీ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.అనంతరం గ్రామస్తులతో కలిసి రచ్చబండ కార్యక్రమం నిర్వహించి గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడారు.ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు వేముల గోపాలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంతటి దారుణమైన పరిస్థితులను ఎప్పుడూ చూడలేదన్నారు.గ్రామాల్లో అభివృద్ధి అన్న మాటే లేదని.రోడ్లన్నీ దారుణంగా తయారయ్యాయని అన్నారు.తెలుగుదేశం పార్టీ హయాంలోనే గ్రామాల్లో అత్యధికంగా సిమెంట్ రోడ్లు నిర్మించారని గుర్తు చేశారు.రాష్ట్రం అంతా ప్రజలు మార్పును కోరుకుంటున్నారని,రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గోపాలరావు అన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కేశంరెడ్డి మధు,క్లస్టర్-3 ఇన్‌చార్జ్ బొల్లినేని నాగేశ్వరరావు,యూనిట్-9 ఇన్‌చార్జ్ నీలం బ్రహ్మరెడ్డి,టిడిపి నాయకులు పూరిమిట్ల మాల్యాద్రి,అడపా రంగయ్య,గొల్లపల్లి వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, పెద్దిరెడ్డి, ప్రసాద్, కొండ్రెడ్డి మాల్యాద్రి, నారాయణ, సుధాకర్, పి.మాల్యాద్రి, గజ్జి.వెంకటేశ్వర్లు, కె.మధుసూదన్, ఎ.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

అందరూ సహనంతో మెలగాలి

ప్రజాశక్తి-నెల్లూరు: సర్వమానవాళికి క్రీస్తు బోధనలు ఆచరణీయమని, ప్రతిఒక్కరూ ప్రేమ, శాంతి, సహనంతో మెలగాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని శ్రీ వెంకటేశ్వర కస్తూర్బ కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి చైర్పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ స్రవంతి, బిషప్ మోస్ట్ రెవ. డాక్టర్ ఎండి ప్రకాశం తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. క్రైస్తవ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-నెల్లూరు : 33/11 కె.వి. కొండయపాలెం సబ్ స్టేషన్ నందు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నేటి ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు నిలిపివేయబడునని డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెపల్లి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండయపాలెం సబ్ స్టేషన్ పరిధిలో గల కావేరి నగర్,స్నేహ నగర్,నక్కల గుంట, సంఘమిత్ర రోడ్,కొండయపాలెం రోడ్,బ్యాంక్ కాలనీ,షార్ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి, కుళాయి, డ్రైయిను తదితర రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేయాలని సచివాలయ కార్యదర్శులను కమిషనర్ శ్రీమతి హరిత ఆదేశించారు. స్థానిక 25వ డివిజను చెన్నకేశవ నగర్ సచివాలయాన్ని కమిషనర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల అమలు రికార్డులను, సిబ్బంది హాజరును పరిశీలించి, సచివాలయం పరిధిలోని గహాలు, కమర్షియల్ భవనాలన్నింటికీ చెత్త సేకరణ బిన్స్ పంపిణీ చేశారా అని విచారించారు.కార్యదర్శులంతా ప్రభుత్వం సూచించిన డ్రెస్ కోడ్ యూనిఫామ్ ప్రతిరోజూ తప్పక ధరించాలని కమిషనర్ సూచించారు.

విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్

ప్రజాశక్తి-నెల్లూరు : విశాఖపట్నంలో వచ్చే మార్చి 3, 4 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ను విజయవంతం చేయాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023కు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివద్ధికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సదస్సులో జిల్లాలోని ఔత్సాహికులైన పారిశ్రామిక వేత్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం మారుతీ ప్రసాద్, ఏపీఐఐసీ జడ్ఎం చంద్రశేఖర్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజర్ మహేష్, పరిశ్రమల కేంద్రం డిడి షఫీ అహ్మద్ పాల్గొన్నారు.

వికలాంగ ఉద్యోగులకు విధులు కేటాయింపు

ప్రజాశక్తి-నెల్లూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థలో ఉద్యోగులుగా బాధ్యతలు స్వీకరించిన 7 మంది వికలాంగులకు వివిధ విభాగాల్లో విధులను కేటాయిస్తూ కమిషనర్ హరిత ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం కమిషనర్ విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు పబ్లిక్ హెల్త్ విభాగం వర్కర్లుగా నాగరాజుపల్లి అమర్ నాథ్, కసినపోగు శ్రీనివాసులు, ఎస్టాబ్లిష్మెంట్ విభాగంలో శనగపల్లి ప్రభాకర్, ఏ.వేణుగోపాల్, ఇంజినీరింగ్ విభాగంలో చెన్నుపాటి మమత, పులి క్రాంతి, మర్రి సుకన్య లకు విధులను కేటాయించారు. కేటాయించిన విధులను సిబ్బంది వెంటనే స్వీకరించాలని సూచించారు.

కెఎన్ఆర్ పాఠశాలలో 'విజయ్ దివస్'

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక భక్తవత్సలనగర్ ప్రాంతంలోని కెఎన్ఆర్ నగర పాలక ఉన్నత పాఠశాలలో విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్ సి సి నెల్లూరు లెఫ్టినెంట్ కామాండర్ కమాండింగ్ ఆఫీసర్ వినయ్ రామచంద్రన్ ఆదేశాలు మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ ప్రకాష్ రావు సహకారంతో సెకండ్ ఆఫీసర్ అసోసియేట్ ఎన్ సి సి ఆఫీసర్ గుండాల నరేంద్ర బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుండాల నరేంద్ర బాబు మాట్లాడారు.కార్యక్రమంలో ఎన్‌సిసి కేడెట్లు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటల పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-కలిగిరి : రాష్ట్ర స్థాయిలో టెన్నిస్, వాలీబాల్ పోటీలకు కలిగిరి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు భీమేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ మురళీలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 17, 18 తేదీల్లో రెండు రోజుల పాటు కర్నూలులో జరుగుతున్న రాష్ట్రస్థాయి టెన్నిస్, వాలీబాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు 7 మంది సెలెక్ట్ కావడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. తమ విద్యార్థులు విద్యతో పాటుగా క్రీడా రంగంలోనూ రాణిస్తున్నారని తెలిపారు. సెలెక్ట్ అయిన వారిలో నిఖిల్, వికాస్, సందీప్, సంజయ్, మహానంది, వర్షన్, రామ్ చరణ్, అభిషేక్ తదితరులున్నారన్నారు. రాష్ట్రస్థాయిలో కీర్తి ప్రతిష్టలు గడించడమే లక్ష్యంగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని హెచ్ఎం పేర్కొన్నారు. ఈ పోటీలలో తప్పనిసరిగా కలిగిరి హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నేపథ్యంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

సర్వేను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : ఆయుష్ మాన్ భవ సర్వేను వేగవంతం చేయాలని ఎంపిడిఒ బజాక్ ప్రవీణ్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక బిట్-3 సచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఆయుష్ మాన్ భవ సర్వే చేయడంలో సిబ్బంది చాలా వెనుకబడి ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయం సిబ్బంది వాలంటీర్లు తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు ఉండాలన్నారు. సకాలంలో చెప్పిన పనిని వాలంటీరులు ఖచ్చితంగా 100 శాతం పూర్తి చేయాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం సచివాలయ వాలంటీర్ల సచివాలయం ద్వారా అందించే సేవల సర్వేపై తలెత్తే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఖాదర్ కరిముల్లా, మండల కో-ఆర్డినేటర్ గాజుల ఇమ్రాన్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం ఉమామహేశ్వరపురం గ్రామంలో శుక్రవారం నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ సతీష్‌నాయుడు యువ సేవా టీమ్ ద్వారా దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గ్లోబల్ విద్యా సంస్థ అధినేత సాదనాల దామోదర్ నాయుడు చేతుల మీదుగా పేద ప్రజలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ సతీష్ నాయుడు వర్ధంతి సమయంలో పేద ప్రజలు చలికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి వారికి సకాలంలో దుప్పట్లు అందజేయాలన్న ఆలోచన రావడం హర్షణీయమన్నారు. గిరిజన జాగృతి వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపట్ల వెంకటపతి మాట్లాడుతూ సమాజంలో పేద ప్రజలకు ఆర్థిక స్థితిగతులు సరిలేక ప్రతికూలంలో భూమి లేక తినడానికి తిండిలేక ఉండడానికి ఇల్లు లేక అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న వారికి సకాలంలో సహాయం చేసి వారి అవసరాలు తీర్చడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సేవాదళ్ అధ్యక్షులు బత్తుల రవిచంద్ర, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు పైడి.హర్ష, పిట్ల ప్రత్యూష్, ఉప సర్పంచ్ డి.శ్రీనివాసులు, డి.రామచంద్ర, ద.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మోసపూరిత సమీక్షలపై తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : ఆన్‌లైన్ ప్లాట్‌ఫారంలలోకి నకిలీ లేదా ప్రాయోజిత లేదా మోసపూరిత సమీక్షలను తీసివేయడానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటోంది వివరాలు తెలియజేయాలని పార్లమెంట్ లో రాజ్య సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లిఖిత పూర్వకంగా ప్రశ్నించారు. అంతే కాకుండా ఈ సమీక్షలను ప్రమోట్ చేయడానికి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీచేయనుందని విషయం వాస్తవమేనా దీనికోసం ఒక కమిటీని ఏర్పాటు చేయడం కూడా వాస్తవమేనా అటువంటి ప్రయత్నం చేసిన మొదటి దేశం భారతదేశమేనా అలా అయితే, దాని వివరాలు తెలపాలని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు స్పందించిన కేంద్రమంత్రి అశ్వినీ కుమార్ చౌబే వినియోగదారుల వ్యవహారాల శాఖ, ఇ-కామర్స్‌లో నకిలీ మోసపూరిత సమీక్షల నివేదికలు ఏమిటి చేయుటకు ఫ్రేమ్‌వర్క్ అభివృద్ధి చేయడానికి ఈ ఏడాది జూన్ 10వ తేదీన ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలో ఇ-కామర్స్ కంపెనీలతో సహా వివిధ వాటాదారులు, పరిశ్రమ సంఘాలు, వినియోగదారు సంస్థలు న్యాయ రంగానికి చెందిన వారు ఉంటారన్నారు. ఇ-కామర్స్ లో నకిలీ మోసపూరిత సమీక్షల నుండి వినియోగదారుల ఆసక్తిని గుర్తించి రక్షించడం కోసం, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ వాటి సేకరణ, నియంత్రణ ప్రచురణ కోసం సూత్రాలు, అవసరాలు, 'ఆన్‌లైన్ కన్స్యూమర్ రివ్యూస్' పై ఫ్రేమ్‌వర్క్‌ను నవంబరు 23వ తేదీన నోటిఫై చేశామన్నారు.

ముళ్లచెట్లతో దర్శనమిస్తున్న మరుభూమి

- పట్టించుకోని పంచాయతీ పాలకులు, అధికారులు

ప్రజాశక్తి-పొదలకూరు : జీవితాంతం ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్న మనిషి అంతిమంగా చేరుకునే స్థలం శ్మశానం. పట్టణంలో శ్మశానంలో ప్రశాంత దొరకడం లేదు. మిగిలిన పంచాయతీలకు ఆదర్శంగా ఉండాల్సిన పొదలకూరు పంచాయతీ శ్మశాన విషయంలో అధ్వానంగా ఉంది. మారు మూల గ్రామాల్లోని శ్మశానాలు చక్కని ప్రహరీ గోడలతో, ఎంతో శోభాయమానంగా, ఉద్యానవనాలు ఉండగా, పొదలకూరు ప్రధాన శ్మశానం మాత్రం కంప చెట్లు, ముళ్లపొదలతో, నడవడానికి దారి లేక పొదల్లోనూ అనువుగా లేక ఇబ్బందులు పడుతున్నారు. స్వర్గధామానికి వెళ్లే దారిలో పెరిగిన కంప, ముళ్లచెట్లను తొలగించాలని పంచాయతీ అధికారులకు,పాలకులకు గ్రామస్తులు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అంత్యక్రియలు, ఖర్మకాండలు జరుపుకునేందుకు ,వాటి కోసం వచ్చిన జనాలకు, నిలువ నీడ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. శ్మశానాన్ని చూస్తే పొదలకూరు అభివృద్ధి ఏంటో తెలిసిపోతుందని పలువురు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు,పాలకులు పట్టించుకొని ముళ్ల కంపలను తొలగించి, ప్రహరీ ఏర్పాటు చేసి, ప్రజలకు నీడ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరితగతిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కె.వి.ఎన్ చక్రధర్ బాబు, సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రూరల్ మండల పరిధిలోని అమ్చూర్ గ్రామంలోని జగనన్న కాలనీలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. ఈ లే అవుట్ లో మొత్తం 123 ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని,అందులో బిలో బేస్మెంట్ స్థాయిలో 59, బేస్మెంట్ స్థాయిలో 37, లింటల్ లెవెల్ లో 2, రూఫ్ లెవెల్ లో 25 గృహాలు మొత్తం 123 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని గృహనిర్మాణ శాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు. వివిధ దశల్లోని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో ఆర్.డి.ఒ మలోల, హౌసింగ్ పీడీ నాగరాజు, హౌసింగ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా వక్ఫ్‌బోర్డ్ వైస్‌చైర్మన్‌గా షౌకత్

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలం లోని అనుమ సముద్రం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు షేక్ షౌకత్ అలీని జిల్లా వక్ఫ్‌బోర్డ్ వైస్ చైర్మన్‌గా నియమించారు. శుక్రవారం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ కార్యాలయంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ వి.ఖాదర్‌బాషా, వైసిపి రాష్ట్ర నాయకులు షేక్ బాబు, ఎంఎల్‌ఎ హఫీజ్‌ఖాన్, వైసిపి రాష్ట్ర నాయకులు హంజా హుస్సేన్ చేతుల మీదుగా జిల్లా వక్ఫ్‌బోర్డ్ నియమకపత్రాన్ని షౌకత్‌అలీ అందుకున్నారు.

శ్రీనివాస్‌కు ధన్యవాదాలు

ప్రజాశక్తి-ఉదయగిరి : మహజన సోషలిస్ట్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన గొట్టిపల్లి శ్రీనివాస్ మాదిగకు ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి జకీరు జాషువా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో మారుమూల ప్రాంతమైన నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి ప్రాంత వాసుకి ఎంఆర్‌పిఎస్, ఎంహెచ్‌పిఎస్, ఎంఎస్‌పి గౌరవ అధ్యక్షులుగా మందా కృష్ణ మాదిగ గుర్తించడం శుభ పరిణామమన్నారు. కృష్ణ మాదిగకు నియోజకవర్గ దళిత బడుగు బలహీన వర్గాల మైనార్టీలు రుణపడి ఉంటారని తెలిపారు. భారత దేశంలో అత్యంత ఎక్కువ నియోజకవర్గాల్లో ఉన్న ఉదయగిరి ప్రాంతం నుంచి బహుజన సమాజ్ పార్టీ ఏ విధంగా బలపడిందో అదే విధంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎంఎస్‌పి బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంఆర్‌పిఎస్ ఉద్యమం కేవలం మాదిగలకే కాకుండా సమాజంలో ఉన్న అన్ని కులాల పేదలకు ఎంతో మేలు చేకూర్చిందన్నారు. ఒంటరి మహిళలు వికలాంగులకు పెన్షన్ సమానంగా ఇచ్చే క్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పోరాటం చేసి సంపాదించిన చరిత్ర కేవలం ఎంఆర్‌పిఎస్ దక్కుతుందన్నారు. జిల్లా నాయకులు జిజావద బాల గురవయ్య మాదిగ, సంయుక్త సురేష్ మాదిగ, కెన్ను మరకల పెంచలయ్య మాదిగ, రావిపాటి సుందరరావు మాదిగ, జకీరు కిరణ్ కుమార్ మాదిగ, నల్లిపోగు హజరత్ మాదిగ పాల్గొన్నారు.

పలుచోట్ల పంటలు పరిశీలన

పొగాకు పంట పరిశీలన

ప్రజాశక్తి-మర్రిపాడు

మాండూస్ తుపాన్ ప్రభావంతో డిసిపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలో దెబ్బతిన్న పొగాకు పంటలను సిటిఆర్ఐ శాస్త్రవేత్తలు ఎం.అనురాధ, పూర్ణ బిందు, ప్రభాకర్ రావు పంటలను పరిశీలించి రైతులకు సూచనలు సలహాలిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల దక్షిణ ప్రాంతంలో చాలా భాగాల్లో పొగాకు దెబ్బతిందని, పొగాకు రైతులకు సలహాలు, పంట నష్టాన్ని అంచనా వేయటానికి పొగాకు బోర్డు నాలుగు బృందాలను ఏర్పాటు చేయగా వారు ఆయా ప్రాంతాల్లో పొగాకు తోటలను పరిశీలించారు. పొలాల్లో ఉన్న నీరు వీలైనంత త్వరగా బయటకు తీసి వేయాలని, నీరు ఉంటే వేరుకు నేలలో మొక్కకు శ్వాస అందక మొక్క త్వరగా చనిపోతుందని, అనుకూలమైన తేమ ఉన్నప్పుడు వీలైనంత త్వరగా అంతర్ సేద్యం చేయాలని, పంటలో అదనంగా వారి పొలానికి సరిపోయే అమోనియం సల్ఫేట్ వేయాలని, మొక్కలకు ఎటువంటి తెగులు శోక కుండా సిలింద్రియా నాసిని కొసైడ్ లేదా కార్బోయో టాప్ పిచికారి చేయాలన్నారు. మొక్కలు వేరు ద్వారా పోషకాలను తీసుకోలేవని తెలిపారు. బృందంలో పొగాకు బోర్డు మేనేజర్ దామోదర్, ఆక్షన్ సూపరిండెంట్ శంకర్రావు, బోర్డు సిబ్బంది ఉన్నారు.

ఉద్యానవన పంటలు పరిశీలన

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండల పరిధిలోని విరువూరు వేంపాడు గ్రామాలలో మాండూస్ తుపాన్ వల్ల నష్టపోయిన బొప్పాయి, మిరప తోటలను శుక్రవారం ఉదయగిరి ఇన్‌ఛార్జి ఉద్యాన అధికారి షేక్ సాహిల్ పరిశీలించారు. ఈ మేరకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పొలంలో నిలిచిన నీటిని తీసివేసి ఎకరాకు 50, 60 కిలోల యూరియా, 25 కిలోల మూరేట్ ఆఫ్ పోటాస్ వేయాలన్నారు. అలాగే కాయకుళ్లు రాకుండా అమిస్టార్ ఒక మిల్లి లేదా కాపర్ డయాక్సైడ్ 2.5 గ్రామ్స్ లీటర్ నీటికి చొప్పున కలిపి హైడ్యాక్సైడ్ 2.5 గ్రాము పీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని ఆయన తగు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ కిరణ్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ శారద, చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలానికి విముక్తి కల్పించాలి

ప్రజాశక్తి-కలిగిరి

తమ పూర్వీకుల కాలం నుండి తమ ప్రాంతానికి సంబంధించిన శ్మశాన స్థలం అక్రమణకు గురవుతుందని వెంటనే ఆక్రమణ చెర నుండి శ్మశానానికి విముక్తి కల్పించాలని మండలంలోని కృష్ణారెడ్డిపాలెం ఎస్‌సి కాలనీవాసులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్దకు ప్రదర్శనగా చేరుకొని రీసర్వే డి టి విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కాలనీ వాసులు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తమ పూర్వీకుల కాలం నుండి తమ ఎస్‌సి కాలనీకి సంబంధించి సుమారుగా 3 ఎకరాల శ్మశాన స్థలం ఉందన్నారు. కాగా సదరు శ్మశాన స్థలంలో గతంలో కొంతమేరకు డంపింగ్ యార్డుకు ఉపయోగంలో ఉండగా మరికొంత స్థలం సోమశిల ఉత్తర కాలువకు వినియోగంలో ఉందన్నారు. అయితే మిగిలి ఉన్న స్థలాన్ని సర్పంచ్ ఆక్రమించి చుట్టూ కంచె వేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తమ ప్రాంతానికి చెందిన శ్మశాన స్థలం నామరూపాలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులలో కాలనీలో

వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఎవరు మృతి చెందినా శవాన్ని రోడ్డుపైనే ఉంచి అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థలం కోసం పడిగాపులు కాయాల్సిన దుర్భర పరిస్థితులు దాపురించాయని కాలనీ వాసులు వాపోతున్నారు. దాదాపుగా 150 కుటుంబాలు వరకు జీవనం సాగిస్తున్నామన్నారు. కనుక రెవెన్యూ అధికారులు తక్షణం స్పందించి శ్మశాన స్థలాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి తమకు శ్మశాన స్థలం కేటాయించే దిశగా చర్యలు తీసుకోవాలని వారు వేడుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులకు మద్దతుగా టిడిపి మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, బొగ్గవరపు వేణు, వెంగపనాయుడు, చాగంటి జయరాంరెడ్డి, తాతయ్య, మాధవ్, స్వర్ణ కొండయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-అల్లూరు

అధికారులతో మాట్లాడుతున్న జెసి

రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మానాథ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బీరం గుంట సమీపంలో రిసర్వేపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకున్న కార్యక్రమాన్ని 7 రోజుల్లో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం నగర పంచాయతీలోని జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. ఆయనతోపాటు కావలి ఆర్‌డిఒ శీనా నాయక్, తహశీల్దార్ చెంచయ్య, సర్వేయర్ అన్రూఫ్, నగర పంచాయతీ కమిషనర్ ఫణి కుమార్, మండల ఉపాధ్యక్షుడు గుమ్మడి సురేంద్ర, నార్త్ ఆములూరు సర్పంచ్ షేక్ కరిముల్లా షా ఖాదర్, తదితరులు ఉన్నారు.

బిఎంఆర్ నివాళులు

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని ఇస్కపల్లి గ్రామంలో బీద రమణయ్య వర్ధంతి సందర్భంగా ఆయన తనయుడు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు శుక్రవారం ఆ గ్రామానికి విచ్చేసి కుటుంబ సభ్యులతో కలసి నివాళులర్పించారు. కావలి నియోజకవర్గంలో పలు గ్రామాల నుండి ఆయన అభిమానులు అక్కడికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల అభిమానం ఎనలేనిదని వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేమని తెలియజేశారు. ఏ స్థాయికి వెళ్లినా నిరశంతరం ప్రజల అభివృద్ధికి పాటు పడతానన్నారు. అనంతరం అల్లూరులోని వైసిపి సీనియర్ నాయకులు నీలం సాయికుమార్ తండ్రి మస్తానయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తహశీల్దారు కార్యాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఆత్మకూర్ ఆర్‌డిఒ కరుణకుమారి శుక్రవారం తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం బిఎల్‌ఒలతో సమావేశమై మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల గ్రాడ్యుయేట్, టీచర్స్ క్లెయిమ్స్ వచ్చినందున జాగ్రత్తగా పరిశీలించాలని బిఎల్‌ఒలకు సూచించారు. అలాగే క్లెయిమ్స్ కాకుండా అర్హత లేని వారిని కూడా జాబితాలో చేర్చారని ఫిర్యాదులు అందాయన్నారు. దూర ప్రాంతాలలో ఉంటూ సొంత గ్రామంలో ఉన్నట్లు విచారణలో రుజువైతే సిఫార్సు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సి ఎన్నికల క్లెయిమ్స్ 25వ తేదీన చివరి గడువు అని తెలిపారు. కావున పరిశీలన పూర్తి చేయాలని, ఓటర్ లిస్ట్‌కు ఆధార్ లింక్ చేయాలన్నారు. ఓటర్ లిస్టుకు ఆధార్ లింకు గతంలో వచ్చినప్పుడు 30శాతం ఉండాలన్నారు. కానీ ఇప్పుడు 61శాతం చేశారని ఇంకా 80శాతం వరకు చేయాలని సూచించారు.

బిఎల్‌ఒలతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ కరుణకుమారి

పనిచేయని బిఎల్‌ఒలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాగా పనిచేసిన వారికి జనవరి 26న రివార్డులు అందజేయనున్నట్లు తెలియజేశారు. ఓటర్ లిస్టులో మృతి చెందిన వారిని డబుల్ ఎంట్రీ, ఫోటో మిస్సింగ్ వంటివి చక్కగా సరిచేసి ఓటర్ లిస్టు తయారు చేసిన వారిని అభినందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ హేమంత్ కుమార్, డిప్యూటీ తహశీల్దారు ఆనందరావు, ఆర్‌ఐ సురేంద్ర, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో కనీస మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఎంపిడిఒకు సిపిఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాల్లో కంపచెట్లు పెరిగి అడవిని తలపిస్తున్నాయని, ఇళ్ల స్థలం ఇచ్చి సంవత్సరం రోజులు కావస్తున్న వారికి కాలనీలో మంజూరు కాక నిరుపయోగంగా ఉన్నాయన్నారు. కరెంటు మంచినీటి వసతులు ఏర్పాటు చేస్తే గుడిసెలు ఏర్పాటు చేసుకుంటారని తెలిపారు. చాలామంది పేదలు అద్దె ఇళ్లల్లో ఉంటూ అద్దె కట్టలేక అవస్థలు పడుతున్నారు. మండల

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

అధికారులు స్పందించి కంపచెట్లు తొలగించి సదుపాయాలు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఇల్లు మంజూరైన మహిళలు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు చేస్తున్న సుకుమార్‌రెడ్డి

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం తుమ్మలపెంట రోడ్డులోని స్కంధ ఫ్రైడ్.. వరహా వెంచర్స్ ప్రాంగంలో గురువారం నుంచి ప్రారంభమైన సహస్ర రుద్ర సహిత సహస్ర చండీ యాగం 2వ రోజున శుక్రవారం శాస్త్రోక్తంగా సాగింది. దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన రుత్విక్కులు, వేద పండితులు నియమబద్ధంగా యాగాన్ని జరిపిస్తున్నారు. తొలిరోజైన గురువారం యాగకర్తలైన మన్నెమాల సుకుమార్ రెడ్డి, కల్పన దంపతులు యాగ ప్రవేశం చేసి విఘ్నేశ్వరపూజ, నవగ్రహ హోమం, ఇతర హోమాలు నిర్వహించి చండీ హోమంలోని తొలి అంకాన్ని పూర్తి చేశారు. రెండో రోజైన శుక్రవారం అమ్మవారు 'శైలపుత్రి' అలంకరాంలో దర్శనమిచ్చారు. శైలపుత్రి అలంకారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బిసిలకు ద్రోహం : టిడిపి

ప్రజాశక్తి-కావలి

అధికారం లోకి రావడానికి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కల్లబొల్లి మాటలు చెప్పి, బిసిలను మోసగించి, బిసిల ఓట్లతో గద్దెనెక్కి, బిసిలను పాతాళంలోకి తొక్కేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని శుక్రవారం టిడిని బిసిసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పుటూరు బాలాగురు స్వామి విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా హామీలు గురించి ప్రశ్నిస్తే, నవరత్నాలు గురించి చెప్తారన్నారని ఎద్దేవా చేశారు. నవరత్నాలకు బిసిల హామీలకి సంబంధం ఏమిటీ అని తెలిపారు. పోనీ నవరత్నాలు ఐనా బిసిలు అందరికీ ఇచ్చారా అంటే.. అదీ లేదన్నారు. 139 కులాలకి 56 కార్పొరేషన్స్ ఇచ్చామని జబ్బలు చరుచుకున్నారని, అసలు బిసిలకు ఏం ఉపయోగం జరిగిందని ప్రశ్నించారు. రాజకీయ నిరుద్యోగులైన 56 మందికి చైర్మన్లు ఇచ్చారని, 672 మందికి డైరెక్టర్స్ ఇచ్చారని తెలిపారు. వాళ్లకి కూర్చోడానికి కుర్చీలు కూడా 8 నెలలు ఇవ్వకుండా అవమానించిన ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం అని విమర్శించారు. పేరు గొప్ప ఊరు దిబ్బలాగా 56 కార్పొరేషన్స్ ఇచ్చి ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వకుండా మోసం చేసిన ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర పుటల్లో నిలిచిపోయారన్నారు. నేటితో కాలపరిమితి ముగుస్తున్నా 56 మంది చైర్మన్లు, 672 డైరెక్టర్లు ఒక్క రూపాయి నిధులు కూడా ముఖ్యమంత్రి దగ్గర నుంచి తీసుకురాలేక, బిసి కార్పొరేషన్ నిధులు పక్కదారి మళ్లించినా నోరు మెదపలేక మిగిలిపోయారన్నారు.

అండర్-17 క్రికెట్‌కు బాలికలు ఎంపిక

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

నెల్లూరు ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన అండర్-17 క్రికెట్ సెలక్షన్‌లో కావలి యడవల్లి గ్రామ ఉన్నత పాఠశాల బాలికలు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 10 తరగతి చదువుతున్న బృందా లహరి, కోవి వెంకట సాహితీలు జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనేందుకు ఎంపికయ్యారని తెలిపారు. శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

గెలుపే ధ్యేయంగా పనిచేద్దాం..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రానున్న 2024లో వైసిపి అత్యధిక మెజారిటి సాధించేలా గెలుపే ధ్యేయంగా పనిచేద్దామని ఆత్మకూరు నియోజకవర్గ పరిశీలకులు గురుమోహన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆత్మకూరు పట్టణ, రూరల్ మండలాల నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. లోటుపాట్లను గురించి చర్చించి పరిష్కరించుకొనేలా కృషి చేద్దామని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా వాటిని గత మూడేళ్లుగా కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిదేనని, దీంతో ఇతర రాష్ట్రాలు మన రాష్ట్రప్రభుత్వ పనితీరుపై చర్చించుకుంటున్నాయని తెలిపారు. వాలంటీరు వ్యవస్థను తమిళనాడు, ఒరిస్సా, తదితర రాష్ట్రాల నుంచి ప్రత్యేక టీములు వచ్చి పరిశీలించాయన్నారు. రానున్న 2024లో అత్యధిక స్థానాల్లో గెలిచేందుకు ఇప్పటి నుంచే కష్టి చేసేలా గృహ సారథులను, సచివాలయాలకు కన్వీనర్లను నియమించనున్నట్లు వారితో మండల పట్టణ నాయకులు, కార్యకర్తలు సమన్వయం చేసుకుంటూ పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సమస్యలు గురించి వివరించాలని కోరగా పలువురు తాము ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపారు. వాటిని వివరంగా నమోదు చేసుకొని ఎంఎల్‌ఎ స్థాయిలో, జిల్లా నాయకుల స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని పరిశీలకులు గురుమోహన్ పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, వైసిపి పట్టణ కన్వీనర్ అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, సిండికేట్ ఫార్మర్ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాపరెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎస్‌సిసెల్ అధ్యక్షుడు కొండ వెంకటేశ్వర్లు, సయ్యద్‌జమీర్ తదితరులున్నారు.

నేడు ధనుంజయరెడ్డి రాక

ప్రజాశక్తి-సీతారామపురం

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన భైరవ కోనలోని ఆలయాన్ని శనివారం ఉదయం దర్శించుకునేందుకు ఉదయగిరి నియోజకవర్గం వైసిపి పరిశీలకులు కొడవలూరు ధనుంజయ రెడ్డి రానున్నారని ఆయన కార్యాలయ సిబ్బంది శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. భైరవకోనలోని దేవాలయాలను దర్శించుకుని అనంతరం సీతారామపురం మండలంలో పర్యటించి మండలంలోని వైసిపి నాయకులు కార్యకర్తలను కలుసుకొని సమావేశం నిర్వహించి, బూతు కమిటీలు, సచివాలయ కమిటీల ఏర్పాటు గురించి చర్చించనున్నట్లు తెలియజేశారు.

ఎంఎల్‌సి అనంతబాబుకు ఘనస్వాగతమా..?

- టిడిపి జిల్లా పార్లమెంట్ ఎస్‌సిసెల్ అధ్యక్షుడు కాకి ప్రసాద్ విమర్శ

ప్రజాశక్తి-కావలి

దళిత యువకుడు సుబ్రహ్మణ్యంను చంపిన ఎంఎల్‌సి అనంతబాబుకు ఘన స్వాగతాలు పలకడం సిగ్గు చేటు అని టిడిపి జిల్లా పార్లమెంట్ ఎస్‌సిసెల్ అధ్యక్షుడు కాకి ప్రసాద్ విమర్శించినట్లు శుక్రవారం ప్రకటనలో తెలియజేశారు. అలానే రాష్ట్రంలో దళితులపై దాడులు రోజు రోజుకి పెరుగుతున్న క్రమంలో అవి నిర్మూలించాల్సిన ప్రభుత్వం దాడులు చేసిన వాళ్లకి సహకరించడం అరాచక పాలనకు నిదర్శనమన్నారు. దళిత యువకుడు కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంను ఎం.ఎల్.సి ఆనంతబాబు తానే చంపాను అని పోలీసు విచారణలో ఒప్పుకున్న ఆనంతబాబుకు సుప్రీంకోర్టులో బెయిలు వచ్చే విధంగా ప్రభుత్వం సహకరించిందన్నారు. అతనితోపాటు సహ నిందితులను విచారించకపోవడం కేసుని నీరుగారచటమేనని తెలిపారు. సెంట్రల్ జైల్ ప్రాంగణంలోకి వాహనాలు అనుమతి లేకపోయినా అతని అనుచరులు కాన్వాయ్ తోటి ప్రవేశించి ఆనంతబాబును గజమాలతో సత్కరించటం దేనికి సంకేతమన్నారు. ఈ రాష్ట్రం ఎటు పోతుందనేది ప్రజాస్వామిక వాదులు ఆలోచించాలన్నారు. అనంతబాబుకు బెయిల్ ఇవ్వటం వల్ల సాక్షులను ప్రభావితం చేసే పరిస్థితి ఉందని తెలిపారు. ఈ పరిస్థితులను పరిగణలోకి తీసుకుని ఎంఎల్‌సి అనంతబాబుకు బెయిల్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రూ.6 లక్షలతో మంచినీటి బోర్లు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనల మేరకు మండలంలోని అప్పారావు పాలెం, దేపూరు, బోయిలచిరివెళ్ల, చెర్లో ఎడవల్లి, ఆరవీడు పంచాయతీల పరిధిలోని మజరా గ్రామాలలో మంచినీటి బోర్లు కోసం 2022-23 ఆర్థిక సంవత్సరాలకు గానూ సాధారణ నిధుల నుండి రూ.6 లక్షలు మంజూరు చేసినట్లు జెడ్‌పిటిసి పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ తెలిపారు. ఇందుకు సంబంధించిన పాలనాపరమైన ఉత్తర్వులను నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్‌పి చైర్మన్ ఆనం అరుణమ్మ, మంజూరు పత్రాలను అందజేశారని తెలిపారు.

విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-అల్లూరు



మండల కేంద్రం లోని ప్రయివేటు పాఠశాలలో శుక్రవారం ఎంఇఒ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వైజ్ఞానిక ప్రదర్శనను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 7 నుండి 10వ తరగతి విద్యార్థులకు వారిలో ఉన్న సృజనాత్మకతను సైన్స్ ద్వారా వెలికి తీసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలియజేశారు. విద్యార్థులలో ఉన్న మేధోశక్తిని వెలికి తీయడమే ప్రధాన లక్ష్యమన్నారు. వారి మెదడుకు పదును పెట్టి వైజ్ఞానిక ప్రదర్శనలో నైపుణ్యాన్ని చాటి చెప్పారని హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి విద్యార్థులతో భవిష్యత్తులో దేశానికి ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. చదువుతోపాటు అన్ని రంగాలలో రాణిస్తున్న విద్యార్థులను అభినందించారు. ఇందులో ప్రధానంగా మొదటి టీములో ఇస్కపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన శిరీష, అలాగే 2వ టీములో మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలకు చెందిన లక్ష్మీ ప్రసన్న, నార్త్‌మోపూరు జిల్లా పరిషత్‌కి చెందిన జమాల్ బాషా 3వ టీముకు, మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలకు చెందిన సింధు 4వ బహుమతి, మరొకరు ఐదవ బహుమతి సాధించారని తెలిపారు.

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు బాలికలకు మొదటిస్థానం

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆత్మకూరు పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్లో వివిధ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులచే శుక్రవారం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పట్నంలోని జెడ్‌పి బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతులు సాధించారు. పి.మహాలక్ష్మి, షేక్ నుశ్రిత, టి.తనిష్క, బి విజయ టీమ్స్‌లో మొదటి స్థానం సాధించారు. వీరిని ఎంఇఒ నజీర్‌బాషా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాసులు చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి విద్య వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని డివిఇఒ మధుబాబు అన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన మండల విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఇఒ అధికారి నజీర్‌బాషా, ప్రధానోపాధ్యాయులు శేషాద్రి వాసులతో కలిసి మండల విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే శాస్త్రీయ దృక్పథం అనేది చాలా అవసరం నేడు మన దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే చిన్నతనం నుండి శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ నజీర్‌బాషా మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆలోచనలతో ప్రజెంటేషన్లు తీసుకు రావాలని తెలియజేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు శేషాద్రి వాసు మాట్లాడుతూ ప్రభుత్వం ఫిబ్రవరి 28వ తేదీన నేషనల్ సైన్స్ డేను నిర్వహించడం, ఆ రోజునే విద్యా వైజ్ఞాన ప్రదర్శన జరుపుకుంటామన్నారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖోఖోలో 'శ్రీ చైతన్య' విజయం

ప్రజాశక్తి-కావలి : విక్రమ సింహపురి యూనివర్సిటీ ఆధ్వర్యంలో 9,10 తేదీల్లో డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జరిగిన అంతర్ డిగ్రీ కళాశాలల ఖోఖో పోటీలలో కావలి శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థినులు రన్నరప్‌గా నిలిచారు. ఈ సందర్భంగా శుక్రవారం కావలి శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో కళాశాల యాజమాన్యం విద్యార్థులను ఘనంగా సత్కరించారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బెజవాడ రవి కుమార్, డైరెక్టర్ పి.జానకిరామ్, ప్రిన్సిపాల్ పి.వి.రావులు మాట్లాడారు. తమ విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన విద్యతోపాటు క్రీడలకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. అందువల్లే గతంలో యూనివర్సిటీ స్థాయిలో తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని తెలిపారు. ఈ నెలలో జరిగే అంతర్ యూనివర్సిటీ స్థాయి ఖోఖో పోటీల్లో మంజుష, కార్తీక పాల్గొంటారని తెలిపారు. రవికాంత్, బోధనా సిబ్బంది, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె.తిరుపాల్, తదితరులు పాల్గొన్నారు.